కొత్తగా ముగ్గురు మంత్రులుప్రమాణం

- హాజరైన సిఎం, మంత్రులు
- 15కు చేరిన మంత్రుల సంఖ్య
- భవిష్యత్తులో మరో ముగ్గురికి అవకాశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరిగింది. ఆదివారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో ఎమ్మెల్యేలు జి వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వాకిటి శ్రీహరి మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. వారితో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రమాణం చేయించారు. సిఎం ఎ రేవంత్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ జి ప్రసాద్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ గౌడ్, ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, కొండా సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి జితేందర్, ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసితో పాటు పలువురు ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ సలహాదారులు, వివిధ కార్పొరేషన్ల చైర్ పర్సన్లు ఇతర ప్రముఖులు హాజరయ్యారు.

నూతనంగా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన వారికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఆహ్వానితులందరూ అభినందనలు తెలిపారు. టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌తో పాటు పలువురు వారికి అభినందనలు చెప్పారు. సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందనీ, మంత్రివర్గ విస్తరణలో కూర్పుతో మరోసారి అది నిరూపితమైందని వారన్నారు. ఇప్పటికే కులగణన చేపట్టి ఆదర్శంగా నిలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రివర్గ విస్తరణ ద్వారా సామాజిక న్యాయాన్ని చాటిందన్నారు. కులగణనతో ఎలాంటి ప్రాధాన్యత లభిస్తుందో తెలంగాణను రోల్ మోడల్‌గా చూస్తున్నారని తెలిపారు.

15కు చేరిన మంత్రులు సంఖ్య

నూతనంగా ముగ్గురు మంత్రుల ప్రమాణ స్వీకారం తర్వాత రాష్ట్ర మంత్రివర్గం సంఖ్య15కు చేరింది. అంతకుముందు సిఎంతో సహ 12 మంది మంత్రులు ఉన్నారు. ఆరు మంత్రిపదవులు ఖాళీగా ఉన్నాయి. విస్తరణలో వాటిని పూర్తిగా భర్తీ చేస్తారని భావించారు. కానీ ముగ్గురికి మాత్రమే అవకాశం కల్పించారు. అసంతృప్తుల్ని బుజ్జగించే పనిలో కాంగ్రెస్ అధిష్ఠానం బిజీగా ఉంది. మరో మూడు మంత్రి పదవుల్ని భర్తీ చేసుకొనే అవకాశం సిఎం రేవంత్‌రెడ్డికి ఉంది. త్వరలో వాటిని కూడా భర్తీ చేస్తారని ప్రచారం జరుగుతుంది.

కొత్త మంత్రుల నేపథ్యమిదే..

గడ్డం వివేక్ వెంకటస్వామి చెన్నూరు నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన ప్రముఖ కాంగ్రెస్ నేత జి.వెంకటస్వామి వారసునిగా రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా పెద్దపల్లి ఎంపిగా గెలిచారు. తెలంగాణ ఉద్యమ సమయంలో 2013లో టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ఎస్)లో చేరారు. 2014 ఎన్నికల సమయంలో టిఆర్ఎస్ నుంచి మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. పెద్దపల్లి స్థానంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2016లో మళ్లీ టిఆర్ఎస్‌లో చేరారు. ఎంపి టికెట్ దక్కకపోవడంతో 2019లో ఎన్నికలకు దూరంగా ఉన్నారు. 2019 ఎన్నికల తర్వాత బిజెపిలో చేరారు. 2023లో మళ్లీ కాంగ్రెస్‌లో చేరిన వివేక్ చెన్నూరు ఎమ్మెల్యేగా గెలిచి, రేవంత్‌రెడ్డి సర్కారులో మంత్రిగా ప్రమాణం చేశారు.

అడ్లూరి లక్ష్మణ్...

ఎమ్మెల్యేగా గెలిచిన తొలిసారే అడ్లూరి లక్ష్మణ్‌ను మంత్రి పదవి వరించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ధర్మపురి నియోజకవర్గం నుంచి గెలిచారు. బిఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌పై 2,229 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1968లో కరీంనగర్ జిల్లాలో జన్మించారు. పెద్దపల్లి కళాశాలలో ఐటిఐ పూర్తి చేశారు. 1986-1994 మధ్య కరీంనగర్ జిల్లా ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. 1996-2001 మధ్య ఎపి యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2006లో ధర్మారం జడ్పిటిసిగా పోటీ చేసి గెలిచారు. 2009లో ధర్మపురి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. 2010-2012 మధ్య కరీంనగర్ జడ్పి చైర్మన్‌గా పని చేశారు. 2009లో అసెంబ్లీ ఎన్నికలు, 2010 ఉప ఎన్నికలో ఓడిపోయారు. 2013-14 మధ్య ఎపి ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్‌గా పని చేశారు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు.

వాకిటి శ్రీహరి...

ఎమ్మెల్యే అయిన తొలిసారే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి దక్కింది. ఆయన 1972లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జన్మించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. బిఆర్ఎస్ అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డిపై 17,522 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 2014-2018 మధ్య మక్తల్ జడ్పిటిసి, జడ్పి ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. 2001-2006 మధ్య మక్తల్ సర్పంచిగా ఉన్నారు. నారాయణపేట్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శిగా పని చేశారు.

మావోయిస్టులను కోర్టులో హాజరుపర్చాలి

- వామపక్ష పార్టీల డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కొనసాగుతున్న మావోయిస్టు అగ్రనాయకుల హత్యలు అత్యంత అమానుషంగా కొనసాగుతున్నాయని వామపక్ష పార్టీలు విమర్శించాయి. బీజాపూర్ పోలీస్ కస్టడీలోని నాయకులను ఒక్కొక్కర్ని కాల్చిచంపి, ఎన్‌కౌంటర్లుగా పోలీసులు ప్రకటిస్తున్నారని తెలిపాయి. ఆదివారం హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో వామపక్ష పార్టీల సమావేశాన్ని నిర్వహించారు. పశ్య పద్మ (సిపిఐ) అధ్యక్షత వహించగా, సిపిఎం నుంచి ఎండీ అబ్బాస్, సిపి ఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ నుంచి వేములపల్లి వెంకట్రామయ్య, కె గోవర్ధన్, ఎంసిపిఐ(యు) నుంచి వనం సుధాకర్, ఎస్‌యుసిఐ(సి) నుంచి తేజ, ఆరెస్పి నుంచి జానకి రాములు పాల్గొన్నారు. 2004 నాటి శాంతి చర్చల ప్రతినిధి సుధాకర్‌తోపాటు, సురేష్ తదితర ఐదుగురి మరణం అనేక ప్రశ్నల్ని లేవనెత్తుతున్నదని తెలిపారు. అంతేగాకుండా పది, 20 మంది నాయకులు ఇంకా పోలీసుల కస్టడీలో ఉన్నట్టు, వారందరినీ కూడా ఇదే రీతిలో కాల్చిచంపి ఎన్‌కౌంటర్ మరణాలుగా ప్రకటించే అవకాశం కనిపిస్తున్నదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బీజాపూర్ పోలీస్ కస్టడీలో ఉన్న మావోయిస్టులందర్నీ వెంటనే కోర్టులో హాజరు పర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుధాకర్, సురేష్ తదితరుల హత్యలపై సుప్రీం కోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని కోరారు. ఆపరేషన్ కగార్‌ను తక్షణం నిలిపేసి, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలను ప్రారంభించాలని సూచించారు.

ఎప్‌సెట్ 2025 ఫలితాల్లో నారాయణ జైత్రయాత్ర



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎప్‌సెట్ 2025 ఫలితాల్లో నారాయణ విద్యార్థుల జైత్రయాత్ర కొనసాగింది. ఇంజినీరింగ్ విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంకుతో పాటు టాప్10లో ఐదు ర్యాంకులు నారాయణ విద్యార్థులవే. అనిరుధ్ రెడ్డి ఫస్ట్ ర్యాంకు, రెండో ర్యాంకు భానుచరణ్ రెడ్డి, భూపతి నితిన్ ఐదవ ర్యాంకు, మణిదీప్ రెడ్డి ఏడవ ర్యాంకు, సూర్యచరణ్ పదవ ర్యాంకు సాధించారు. మొత్తంగా వంద ర్యాంకుల లోపు 46, వెయ్యిలోపు 416 ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డా.పి సింధూర నారాయణ, డైరెక్టర్ పి శరణి నారాయణ మాట్లాడుతూ, నిపుణులైన అధ్యాపక బృందం, ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌ల వల్లే ఇంతటి విజయం సాధ్యమైందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు,అధ్యాపక బృందానికి ఆమె అభినందనలు తెలిపారు.

ఎప్‌సెట్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థుల విజయభేరి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదివారం విడుదలైన ఎపి ఎప్‌సెట్ 2025 ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు విజయభేరి మోగించారు. టాప్ 10లోపు ఎనిమిది ర్యాంకులు, వంద లోపు 85 ర్యాంకులు సాధించి సత్తా చాటారు. అగ్రి ఫార్మాలో ఎ షణ్ముఖ నిశాంత్ రెండో ర్యాంకు, అకిరందన్ వినయ్ మూడో ర్యాంకు, రామచరణ్ రెడ్డి (ఇంజినీరింగ్) నాలుగో ర్యాంకు, షణ్ముఖ్ నాలుగో ర్యాంకు, లక్ష్మీ చరణ్ ఏడవ ర్యాంకు, త్రిశూల్ (ఇంజినీరింగ్) ఎనిమిదవ ర్యాంకు,రుత్విక్ సాయి (ఇంజినీరింగ్) తొమ్మిదవ ర్యాంకు, వెంకటమణి ప్రీతమ్ (ఇంజినీరింగ్) పదవ ర్యాంకు సాధించారు. ఇంజినీరింగ్, అగ్రి ఫార్మాలో టాప్ ర్యాంకులతో శ్రీచైతన్యకు పోటీలేదని మరోసారి నిరూపించారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ మాట్లాడుతూ, నిపుణులైన అధ్యాపక బృందం, ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాంల వల్లే ఇంతటి విజయం సాధ్యమైందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు,అధ్యాపక బృందానికి ఆమె అభినందనలు తెలిపారు.

ఎల్‌వి ప్రసాద్ ఆస్పత్రికి 11 ఎకరాల భూమి వితరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రిటైర్డ్ ఐఎఎస్ అధికారి కొప్పుల రాజు సతీమణి కె.దమయంతి తన తల్లిదండ్రుల నుండి వారసత్వంగా పొందిన 11 ఎకరాల భూమిని ఎల్‌వి ప్రసాద్ కంటి సంరక్షణ కేంద్రానికి విరాళంగా ఇచ్చారు. యువతను ఆప్టిషియన్లుగా తయారు చేసే శిక్షణా కేంద్రం, అంధుల పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి విరాళంగా ఇస్తున్నట్టు తెలిపారు. అలాగే తాను పొదుపు చేసిన రూ.2 కోట్లను సైతం పేదల అభ్యున్నతి కోసం ఆ సంస్థకు విరాళంగా ఇస్తున్నట్టు తెలిపారు. ఎల్‌వి ప్రసాద్ ఇనిస్టిట్యూట్ తన గ్రామం చుట్టూ ఉన్న ఐదు లక్షల జనాభాకు కంటి సంరక్షణలో సేవలు అందిస్తామని ప్రకటించిందని ఆమె తెలిపారు. ఇందుకు సంబంధించి ఇరువురి మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని పేర్కొన్నారు. సమీప గ్రామాల్లో పేదలు సరసమైన ధరలకు నాణ్యత గల కంటి సంరక్షణ సేవలను పొందవచ్చని వివరించారు.

పది ఉమ్మడి జిల్లాలకు మంత్రి పదవులివ్వాలి

- మల్‌రెడ్డి రంగారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదేళ్లు బిఆర్ఎస్‌తో కొట్లాడి.. కాంగ్రెస్‌ను కాపాడింది తామేనని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంత్రిపదవి ఆశించి భంగపడిన ఆయన్ను కాంగ్రెస్ పెద్దలు ఆదివారం బుజ్జగించారు. అనంతరం మల్‌రెడ్డి రంగారెడ్డి మీడియాతో మాట్లాడారు. పార్టీ లైన్‌లోనే ఉంటామన్న ఆయన.. పది ఉమ్మడి జిల్లాలకు మంత్రి పదవులివ్వాలని డిమాండ్ చేశారు. "మా మొర అధిష్టానం వినలేదు. పార్టీలో కొత్తవాళ్లకు పదవులిస్తే.. కార్యకర్తలు బాధపడతారు. పార్టీకి ఇబ్బందికర పరిస్థితి వస్తోంది. ఇచ్చిన జిల్లాలకే రెండు, మూడు మంత్రి పదువులు ఇస్తున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు గతంలో ఆరుగురు మంత్రులుండేవారు. మా బాధను అధిష్టానానికి చెప్పే అవకాశం పిసిసి చీఫ్ ఇవ్వాలి. నా సామాజికవర్గమే అడ్డొస్తే.. పార్టీ కోసం పదవి త్యాగం చేస్తాం"అని రంగారెడ్డి అన్నారు.

సజావుగా టిజి ఐసెట్

హైదరాబాద్ బ్యూరో : ఎంబిఎ ఎంసిఎ అడ్మిషన్ల కోసం నిర్వహించే తెలంగాణ ఐసెట్ 2025 తొలి రోజు రెండు విడతల పరీక్షను సజావుగా నిర్వహించారు. మొదటి విడత ప్రశ్న పత్రాల సెట్‌ను తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య బాలకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ఆచార్య ఇటికాల పురుషోత్తం, ఆచార్య మహమూద్, సెక్రటరీ ఆచార్య శ్రీరామ్ వెంకటేష్, టిజి ఐసెట్ చైర్మన్ ఆచార్య కాజా అల్తాఫ్ హుస్సేన్, కన్వీనర్ ఆచార్య అల్వాల రవిలతో కలిసి ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉన్నత విద్య మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ అనతి కాలంలోనే రాష్ట్ర స్థాయి కామన్ ఎంట్రన్స్‌లను నిర్వహించ శక్తి సామర్థ్యాలను ఎంజీయూ ప్రోది చేసుకోవడం హర్షించదగ్గ విషయమని తెలిపారు.మొత్తం మూడు విడతల్లో నిర్వహించనున్న కంప్యూటర్ ఆధారిత పరీక్షలను ఉదయం పది గంటల నుండి 12:30 వరకు 93 పరీక్షా కేంద్రాల్లో, మధ్యాహ్నం రెండున్నర గంటల నుండి ఐదు గంటల వరకు 91 పరీక్ష కేంద్రాల్లో రెండు విడతలుగా నిర్వహించారు. మొదటి 24,330 మంది అభ్యర్థులకు గాను 21,897 (90శాతం) అభ్యర్థులు హాజరుకాగా, మధ్యాహ్నం 24,330 అభ్యర్థులకు గాను, 22,136, (90. 98శాతం) హాజరైనట్టు కన్వీనర్ ఆచార్య అల్వాల రవి తెలిపారు. రెండో విడత పరీక్షల్లో దివ్యాంగ అభ్యర్థులు, ఉర్దూ మీడియం అభ్యర్థులకు వారు కోరుకున్న ఐచ్ఛిక కేంద్రాలను కేటాయించినట్టు తెలిపారు. మధ్యాహ్నం ప్రశ్నపత్రాల సెట్‌ను ఆచార్య ఇటికాల పురుషోత్తం, ఆచార్య వెంకటేష్, ఆచార్య కాజా అల్తాఫ్ హుస్సేన్, ఆచార్య అల్వాల రవి విడుదల చేశారు.

కొలువుల ముచ్చటేదీ?

- జాబ్ కేలండర్ మరిన ప్రభుత్వం
- ఎస్‌సి వర్గీకరణ పూర్తయినా విడుదల కాని నోటిఫికేషన్లు
- ఆటంకాల్లేకున్నా ఆగిన వైనం
- మంత్రివర్గ సమావేశంలోనూ చర్చ లేదు
- ఆందోళనలో నిరుద్యోగులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కాంగ్రెస్ సారథ్యంలోని ప్రజాప్రభుత్వం కొలువుల భర్తీ ప్రక్రియను మరిచిపోయినట్టుగా ఉన్నది. జాబ్ కేలెండర్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీ వేదికగా గతేడాది ఆగస్టు రెండున ప్రకటించినా అది అమలుకు నోచుకోలేదు. దీంతో నిరుద్యోగులు తీవ్ర నిరాశలో ఉన్నారు. అయితే ఎస్‌సి వర్గీకరణ అమలుకు అనుకూలంగా ఆగస్టు ఒకటిన సుప్రీంకోర్టు తీర్పు వెల్లడించింది. ఆ తీర్పును రాష్ట్ర ప్రభుత్వం స్వాగతించింది. అందులో భాగంగా గతేడాది అక్టోబర్ 12న ఎస్‌సి వర్గీకరణను అధ్యయనం చేసేందుకు జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ప్రభుత్వం నియమించింది. సమగ్రంగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. మూడు కేటగిరీలుగా ఎస్సీలను విభజించింది. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3లుగా ప్రకటించింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులను ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రభుత్వం విడుదల చేసింది. గ్రూప్-1లో 3.2888 శాతం ఉన్న అత్యంత వెనుకబడిన 15 కులాల వారికి ఒక శాతం, గ్రూప్-2లో 62.74 శాతం ఉన్న 18 కులాల వారికి తొమ్మిది శాతం, గ్రూప్-3లో 33.963 శాతం ఉన్న 26 కులాల వారికి ఐదు శాతం చొప్పున రిజర్వేషన్ ఉండాలని నిర్ణయించింది. ఏప్రిల్ 14 వరకు ఎస్సీ వర్గీకరణ పూర్తి కానందున ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లను ప్రభుత్వం విడుదల చేయలేదు. కానీ ఇప్పుడు ఎలాంటి ఆటంకం లేకున్నా నోటిఫికేషన్లు విడుదల కావడం లేదు. ప్రభుత్వంలో ఉద్యోగాల భర్తీకి సంబంధించిన చర్చ జరగడం లేదు. ఎప్పుడు విడుదల అవుతాయో స్పష్టత లేదు. దీంతో నిరుద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

రాజీవ్ యువ వికాసం లేదు... ఉద్యోగాల్లేవు

ఈనెల రెండో తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరుద్యోగుల సమస్యల గురించి, జాబ్ కేలెండర్ గురించి, కొలువుల ప్రకటన గురించి ప్రస్తావిస్తారని అందరూ ఎదురుచూశారు. కానీ నిరాశే ఎదురైంది. ఈ నెల ఐదో తేదీన మంత్రివర్గ సమావేశంలో చర్చించి ఉద్యోగాల భర్తీ గురించి కార్యాచరణ ప్రకటిస్తారని ఆశించారు. మంత్రివర్గంలోనూ నిరుద్యోగుల గురించి చర్చించకపోవడం గమనార్హం. ఇంకోవైపు రాజీవ్ యువ వికాసం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. రూ.50 వేల నుంచి రూ. నాలుగు లక్షల వరకు ఆర్థిక సహాయం చేస్తామని హామీ ఇచ్చింది. ఈనెల రెండో తేదీన లబ్దిదారుల పేర్లను ప్రకటిస్తామని వెల్లడించింది. తీరా ఈ నెల రెండున దాన్ని వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది. దీంతో నిరుద్యోగులు తీవ్ర అసహనానికి లోనవుతున్నారు. ఒకవైపు రాజీవ్ యువ వికాసం లేక, ఇంకోవైపు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మాటతప్పిన ప్రభుత్వం

'అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తాం.'అని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చింది. గతేడాది డిసెంబర్ ఏడున రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు దీరింది. ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా గతేడాది నవంబర్ 14 నుంచి డిసెంబర్ తొమ్మిదో తేదీ వరకు ప్రజా విజయోత్సవాల పేరుతో కార్యక్రమాలను నిర్వహించింది. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇస్తామన్న కొలువులు రెండు లక్షలు... ఏడాది పాలనలో ఇచ్చిన ఉద్యోగాలు కేవలం 54,520 మాత్రమే. ఇంకా 1,45,480 కొలువులను ఇవ్వాల్సి ఉన్నది. మొదటి ఏడాదిలో రెండు లక్షల కొలువులు ఇవ్వకుండా మాటతప్పిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నా యి. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ ఇచ్చిన మాట అధికారంలోకి వచ్చాక నిలబెట్టుకోలేదన్న అభిప్రాయం నిరుద్యోగ యువతలో వినిపిస్తున్నది. రాజీవ్ యువ వికాసం అందకపోవడం, ప్రభుత్వం ప్రకటించిన జాబ్ కేలెండర్ అమలు కాకపోవడం, ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల కాకపోవడంతో నిరుద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

'సర్దుకోండి' ప్లీజ్

- ఇంటింటికీ తిరిగిన మీనాక్షి, మహేష్‌కుమార్
- బుజ్జగింపులు... ఓదార్పులు... హెచ్చరికలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆరు ఖాళీలకుగానూ ముగ్గురికి మాత్రమే మంత్రివర్గంలో అవకాశం దక్కింది. మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కపోవడంతో ఆ పదవి ఆశిస్తున్న మిగతా ఎమ్మెల్యేలు అలకపాన్పులెక్కారు. అంతేకాకుండా తమ అనుయాయులు వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌పై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది. మంత్రి పదవి మాకివ్వరా? అంటూ రకరకాలుగా ముఖం చాటేస్తున్నారు. దీంతో అధిష్టానం కూడా రంగంలోకి దిగింది. వారిని బుజ్జగించే పనిలో పడింది. ఇంటింటికి తిరిగి వారిని సముదాయిస్తున్నారు. ఈ దఫా ముగ్గురికి మాత్రమే మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కడం వెనుక ఉన్న పరిస్థితులను రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మహేష్‌కుమార్‌గౌడ్ వారికి వివరించే ప్రయత్నం చేశారు. ఇంటింటికి తిరిగి వారిని బుజ్జగించారు. ఓదార్చారుస్తున్నారు. అయినప్పటికీ వారిని ఇంకా శాంతించలేదని తెలుస్తోంది. కొత్తగా మంత్రుల పేర్లు ప్రకటించగానే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అజ్ఞాత వాసంలోకి పోయినట్టు వార్తలొస్తున్నాయి. ఫోన్లు స్విచ్ఛాప్ చేశారు. ఎక్కడా ఉన్నారో తెలియక సొంత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆయనకు మంత్రి పదవి ఇస్తామన్న హామీ నేపథ్యంలో ఆయనకు వస్తుందన్న ప్రచారం కూడా బలంగా జరిగింది. దీంతో ఆయన తీవ్ర అసంతృప్తికి గురైనట్టు తెలుస్తోంది. సామాజిక సమీకరణాల నేపథ్యంలో ఈ సారి రెడ్డి సామాజిక తరగతికి మంత్రివర్గంలో చోటు దక్కలేదని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి రామ్మోహన్‌రెడ్డి కూడా బలంగా మంత్రి పదవిని ఆశిస్తున్నారు. ఆ పదవి కోసం ఆయన దీక్షలు కూడా చేశారు. కానీ ఆయనకు బెర్తు దక్కపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆయన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించి, తన మనోవేదనను చెప్పాలని ప్రయత్నించారు. కానీ టిపిసిసి అధ్యక్షులు జోక్యం చేసుకోవడంతో ఆయన తన ప్రెస్ కాన్ఫరెన్స్‌ను వాయిదా వేసుకున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి పి. సుదర్శన్‌రెడ్డికి బెర్తు దాదాపు ఖాయమైనట్టు ప్రచారం జరిగింది. కానీ చివరి నిమిషంలో ఆయనకూ ఆ పదవి దక్కలేదు. వీరితోపాటు ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు పేరు కూడా ఆదిలాబాద్ నుంచి బలంగా వినిపించింది. అక్కడి నుంచి జి. వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి దక్కడంతో ఆయన కూడా అసంతృప్తితో ఉన్నట్టు తెలిసింది. దేవరకొండ ఎమ్మెల్యే బాలూ నాయక్ ఎస్టీ కోటాల్లో మంత్రి పదవి వస్తుందనీ, ఆయనకు సీనియర్ నేత జానారెడ్డి ఆశీస్సులు ఉన్నాయనే ప్రచారం జరిగింది. ఆయన కూడా మంత్రి పదవి వస్తుందనే నమ్మకం పెట్టుకున్నారు. అదే సామాజిక తరగతి నుంచి డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్‌కు డిప్యూటీ స్పీకర్ పదవి రావడంతో ఆయనకు మంత్రి పదవి వెనక్కి పోయిందని పార్టీ వర్గాలు చెప్పాయి.

అతి అంచనాలతో జిడిపి జిమ్మిక్కు

- నాల్గవ స్థానం అబద్ధం
- వెబినార్‌లో జెఎన్‌యు ఆర్థికశాస్త్ర పూర్వ అధ్యాపకులు ప్రొఫెసర్ అరుణ్‌కుమార్



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అతి అంచనాలతో దేశ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)ని గణించి, భారత ఆర్థికవ్యవస్థ పురోగతిలో ఉందని మోడీ సర్కారు ప్రచారం చేసుకుంటున్నదని జెఎన్‌యు ఆర్థికశాస్త్ర పూర్వ అధ్యాపకులు ప్రొఫెసర్ అరుణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'ఇండియా జపాన్‌ను అధిగమించి 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారిందా?' అనే అంశంపై జరిగిన వెబినార్‌లో ఆయన ముఖ్యవక్తగా మాట్లాడారు. జిడిపి లెక్కింపు ప్రక్రియలో జపాన్ అనుసరిస్తున్న విధానాలకు, భారతదేశ గణనకు అనేక అంశాల్లో వ్యత్యాసాలు ఉన్నాయని వివరించారు. ఏమాత్రం విశ్వసనీయత లేని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) లెక్కలపై ఆధారపడి, భారతదేశం జపాన్‌ను అధిగమించి నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతున్నదని పాలకవర్గం చెప్తున్నదనీ, ఇది పూర్తిగా వాస్తవ విరుద్ధమని విశ్లేషించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత ప్రజల దృష్టిని మరల్చేందుకు పాలకవర్గం ఈ తరహా ప్రచారాన్ని ముమ్మరం చేసిందన్నారు. 2008లో ప్రపంచానికి ఆర్థిక మాంద్యం ప్రమాదం ఏమీ లేదనీ, వృద్ధిరేటు గణనీయంగా పెరుగుతుందని ఐఎంఎఫ్ చెప్పిందనీ, కానీ ఆ ఏడాది ఆ అంచనాలకు పూర్తి భిన్నంగా జరిగిందని గుర్తుచేశారు. కేవలం ప్రభుత్వం ఇచ్చే లెక్కల్ని బట్టే ఐఎంఎఫ్ ఆర్థిక స్థితిగతుల్ని లెక్కిస్తుందే తప్ప, సొంతంగా ఆయా శాఖల నుంచి గణాంకాలను తెప్పించుకొనే వ్యవస్థే వారికి లేదని స్పష్టం చేశారు. జిడిపిలో జపాన్‌ను దాటిపోతున్నామని ప్రచారం చేస్తున్నారనీ, వాస్తవానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సర చివరి అంచనాలు 2027లో వస్తాయని విశ్లేషించారు. భారతదేశంలో బడ్జెట్ల రూపకల్పనలో ముందస్తు, రెండో ముందస్తు, ప్రొవిజినల్, రివైజ్డ్, ఫైనల్ అంచనాలు అనే ఐదు వ్యవస్థలు ఉంటాయని గుర్తుచేశారు. కేవలం ప్రజల్ని పక్కదారి పట్టించేందుకు ఈ తరహా చర్చను మోడీ సర్కార్ తెరపైకి తెస్తున్నదని చెప్పారు. 2016-17లో జిడిపి ఎనిమిది శాతం ఉంటుందని అంచనా వేశారనీ, అదే ఏడాది నోట్ల రద్దు తర్వాత జిడిపి మూడు శాతానికి పడిపోయిందని తెలిపారు. ఆ తర్వాత జిఎస్‌టి ప్రవేశం, కోవిడ్ లాక్‌డౌన్ వంటి నిర్ణయాలతో ఏనాడూ ప్రభుత్వ అంచనాలు వృద్ధిరేటును చేరుకోలేదని వివరించారు. జపాన్ జనాభా, వారి తలసరి ఆదాయం, భారతదేశ జనాభా, వారి తలసరి ఆదాయాల్లో భారీ వ్యత్యాసాలు ఉంటాయన్నారు. భారతదేశంలో వ్యవసాయరంగం అతిపెద్ద అసంఘటిత రంగం అనీ, ఉత్పత్తి పెరిగితే ధరలు తగ్గాలనేది ఎకనామిక్స్ మూల సూత్రమనీ, మరి ఎందుకు ద్రవ్యోల్బణం పెరుగుతుందో పాలకవర్గ మేధావులు వివరణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఆర్థికాభివృద్ధి అంచనాల రూపకల్పనలో 0.7 శాతం తేడాను ఆర్థికవేత్తలు అంగీకరిస్తారనీ, కానీ గడచిన పదేండ్లలో భారతదేశంలో ఈ వ్యత్యాసం 2.7 శాతంగా ఉన్నదని వివరించారు. జపాన్‌ను మించి జిడిపి వృద్ధి చెందితే, భారతదేశ ప్రజలు జపాన్‌కంటే మెరుగైన జీవన ప్రమాణాలను అనుభవించాలనీ, కానీ దేశంలో ఇప్పుడు ఆ పరిస్థితులు ఉన్నాయా? అని ప్రశ్నించారు. శ్రమశక్తికి సంబంధించిన విధాన రూపకల్పనలోనే లోపాలు ఉన్నాయనీ, సంపద కొందరి చేతుల్లోనే నిలిచిపోయేలా ఆర్థిక విధానాలు ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలపై ఆర్థిక ఆంక్షలు పెరుగుతున్నాయనీ, వారి బ్యాంకు ఖాతాల్లోంచి నగదు ఉపసంహరణపై కూడా నెలకు మూడుసార్లకు మించి తీయకూడదనే షరతులు పెడుతున్నారని చెప్పారు.

హైదరాబాద్ చేరుకున్న ఎస్ఐబి మాజీ ఐజీ ప్రభాకర్‌రావు

- నేడు సిట్ విచారణకు హాజరు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక సూత్రధారి అయిన ఎస్ఐబి మాజీ ఐజి ప్రభాకర్‌రావు అమెరికా నుంచి ఆదివారం రాత్రి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అక్కడ నుంచి ఆయన ఇబ్రహీంబాగ్‌లోని తన విల్లాకు వెళ్లారు. కాగా, సోమవారం ఫోన్‌ట్యాపింగ్ కేసును దర్యాప్తు జరుపుతున్న జూబ్లీహిల్స్ స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) అధికారుల ఎదుట హాజరు కానున్నారు. అమెరికాలో తన చికిత్స నిమిత్తం ఉంటున్న ప్రభాకర్‌రావు ఈ కేసులో కీలక నిందితుడని సిట్ తేల్చింది. ఏడాది కాలంగా ఆయన్ను విచారించడానికి సిట్ అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేశారు. ఇంటర్‌పోల్ సహాయాన్ని కూడా అర్థించారు. తనకు బెయిల్ కోసం సుప్రీంకోర్టులో ప్రభాకర్‌రావు ప్రయత్నించారు. బెయిల్ పిటిషన్‌పై విచారణను వాయిదా వేసిన సుప్రీంకోర్టు ప్రభాకర్‌రావు మాత్రం వెంటనే విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. అప్పటివరకూ చట్టపరంగా ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని దర్యాప్తు అధికారులకు సూచించింది. సుప్రీంకోర్టు జారీ చేసిన పాస్‌పోర్టు సహాయంతో ప్రభాకర్‌రావు హైదరాబాద్‌కు చేరుకున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్, ఇతర పార్టీలకు చెందిన ప్రముఖ నాయకులతో పాటు వ్యాపారులు, పలువురు సినీ ప్రముఖుల ఫోన్ల ట్యాపింగ్ చేయాలని ఎస్ఐబి చీఫ్‌గా ఉన్న ప్రభాకర్‌రావు అంతర్గతంగా తన అధికార బృందానికి ఆదేశించినట్టు ఆరోపణలున్నాయి. ఎస్ఐబి కార్యాలయంలోనే ప్రత్యేక గదిని ఏర్పాటు చేసుకుని ఆధునిక పరికరాల ద్వారా ఆయన కిందిస్థాయి సిబ్బంది ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్టు సిట్ దర్యాప్తులో తేల్చింది. అరెస్టు చేసిన నలుగురు అధికారులు సైతం ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకే తాము ఫోన్ ట్యాపింగ్‌లకు పాల్పడినట్టు వాగ్మూలం ఇచ్చారు. అందులో కీలక పాత్ర వహించిన ఐ న్యూస్ సిఇఒ శ్రవణ్‌రావు సైతం ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకే వ్యవహారాలు నడిపించినట్టు సిట్ దర్యాప్తులో ఒప్పుకున్నారు. ఈ నేపథ్యంలో సిట్ ఎదుట విచారణ హాజరుకాబోతున్న ప్రభాకర్‌రావును విచారించడానికి ప్రశ్నల జాబితాతో సిట్ అధికారులు సిద్ధమయ్యారు. ముఖ్యంగా, ఏ నాయకుల ఆదేశాలతో ఫోన్ ట్యాపింగ్ చేశారు? కీలక నేతలు ఎవరెవరు దాని వెనుక ఉన్నారు? మొత్తం వ్యవహారాన్ని ఎవరు నడిపించారు? తదితర ప్రశ్నలను సిట్ అధికారులు సంధించనున్నట్టు తెలిసింది. మొత్తంమీద ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక సూత్రధారిగా పేర్కొనబడుతున్న మాజీ ఐజీ ప్రభాకర్‌రావు దర్యాప్తు అధికారుల ముందు ఎలాంటి నిజాలను బయటపెట్టబోతున్నారనే ఉత్కంఠ ఇటు బిఆర్ఎస్‌తో పాటు అన్ని రాజకీయ పక్షాల్లో నెలకొంది. ఇప్పటికే సిట్ దర్యాప్తు జరిపే జూబ్లీహిల్స్ ఎసిపి కార్యాలయం వద్ద ప్రభాకర్‌రావు విచారణ కోసం అధికారులు ఏర్పాట్లను పూర్తిచేసినట్టు తెలిసింది.

మున్నేరు టూ పాలేరు

- గ్రావిటీ కెనాల్‌కు నేటితో టెండర్లు పూర్తి
- మంత్రి పొంగులేటి కృషితో రూ.162.54 కోట్లు కేటాయింపు
- మూడు జిల్లాల్లో తీరనున్న తాగు, సాగునీటి అవసరాలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సముద్రం పాలవుతున్న మున్నేరు వరద నీటిని పాలేరు జలాశయానికి మళ్లిస్తే ఖమ్మం జిల్లాలో సాగర్ ఆయకట్టుకు సమృద్ధిగా నీరందించొచ్చనే లక్ష్యంతో ప్రతిపాదించిన 'మున్నేరు-పాలేరు' వరద కాల్వ తవ్వకానికి టెండర్ల దాఖలు గడువు సోమవారంతో ముగియనుంది. రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక కృషితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పరిపాలన అనుమతులు మంజూరు చేశారు. మున్నేరు వరదను కూడా ఇది 10 వేల క్యూసెక్కుల వరకు తగ్గిస్తుంది.

ఈ నిర్మాణానికి రూ.162.54 కోట్ల నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం నుంచి గత నెలలో ఆదేశాలు జారీ అయ్యాయి. ఇది పూర్తయితే భారీ ఖర్చు లేకుండా గ్రావిటీ కెనాల్ ద్వారా నీటిని మళ్లించొచ్చు. ప్రభుత్వం చేపట్టే లింక్ కాలువ నిర్మాణంతో దాదాపు 10 టిఎంసిల మున్నేరు నీళ్లను మళ్లిస్తారు. మున్నేరు నుంచి సీతారామ ఎత్తిపోతల ప్రధాన కాలువకు అనుసంధానిస్తూ లింక్ కాలువ తవ్వడం ద్వారా పాలేరుకు నీళ్లు చేరతాయి. పాలేరు జలాశయం పరిధిలో 2.54 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది. పాలేరు నియోజకవర్గంలోనే 1.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. సూర్యాపేట, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాలకు తాగునీరు ఇవ్వడంతోపాటు డోర్నకల్ నియోజకవర్గ పరిధిలో పది చెరువులను నింపొచ్చు.

సీతారామ కాల్వకు లింక్ కెనాల్ అనుసంధానం

గోదావరి జలాలను పాలేరు జలాశయానికి తరలించే క్రమంలో ఏన్కూరు ప్రాంతం నుంచి పాలేరు లింక్ కెనాల్‌తో అనుసంధానిస్తారు. ఈ కాల్వ పాలేరు జలాశయం వరకు 74 కి.మీ. ఉండగా, గార్ల మండలంలోని పుల్లూరు సమీపంలో 37వ కి.మీ. వద్ద మున్నేరు వరద కాల్వను అనుసంధానించాలనేది ప్రతిపాదన. ఇదే మండలంలోని మద్దివంచ ప్రాంతంలోని చెక్ డ్యాం నుంచి 9.5 కి.మీ. వరద కాల్వ తవ్వి ఇక్కడ అనుసంధానిస్తారు. దాంతో మున్నేరు వరద నుంచి కనీసం 6-10 వేల క్యూసెక్కుల నీటిని మళ్లించే అవకాశాన్ని అధికారులు అంచనా వేశారు. మున్నేరు నుంచి వరద కాల్వ ప్రారంభమయ్యే మద్దివంచ ప్రాంతం నుంచి వరద మళ్లింపు కాల్వ లింక్ కెనాల్లో కలిపే పుల్లూరు ప్రాంతం నాలుగు మీటర్ల లోతట్టుగా ఉండటంతో వరద నీరు గ్రావిటీ ద్వారానే పాలేరు లింక్ కెనాల్‌కు చేరనుంది. మున్నేరు ఏటా కనీసం 30 నుంచి 45 రోజులపాటు పూర్తిస్థాయిలో ప్రవహిస్తుందనే అంచనా ఉండగా, ఈ సమయంలో వరద నీటిని పాలేరుకు మళ్లిస్తే కనీసం 20 టీఎంసీల నీటిని నిల్వ చేయొచ్చని అంచనా వేశారు. కాల్వ తవ్వకానికి ప్రభుత్వ భూములతోపాటు, సుమారు 200 ఎకరాలు సేకరించాల్సి ఉంటుంది. దీనికి సంబంధించిన డిపిఆర్‌ను సీఈ విద్యాసాగర్, ఎస్ఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు, డిఇఇ బానాల రమేష్ రెడ్డి రూపొందించారు.

బేయర్ నుంచి బికోట విడుదల

హైదరాబాద్ : బేయర్, కాండం తొలుచు పురుగులను సమర్థవంతంగా నివారించడంలో వరి రైతులకు సహాయపడటానికి కొత్తగా బికోటను విడుదల చేసినట్లు బేయర్ క్లస్టర్ కమర్షియల్ లీడ్ మోహన్ బాబు తెలిపారు. హానికరమైన కీటకాల నుండి మెరుగైన రక్షణను అందించడానికి బికోట బేయర్ మద్దతును అందిస్తుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో దీన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. కాండం తొలుచు పురుగులు వరి పంటలకు అత్యధిక స్థాయి నష్టాన్ని కలిగిస్తాయి, దీని వలన దిగుబడి తగ్గుతుంది. ఈ చీడ పీడలపై బికోట త్వరగా పనిచేస్తుందన్నారు.

గ్రాండ్‌గా కాస్మో డెంటల్ గ్రూప్ ఫ్రాంచైజీ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్

డెంటల్ కేర్ నెట్‌వర్క్‌లలో ఒకటైన కాస్మో డెంటల్ గ్రూప్ అమీర్‌పేట్‌లో తన కొత్త ఫ్రాంచైజీని ప్రారంభించారు. దీంతో హైదరాబాద్‌లో 5ఫ్రాంచైజీ క్లినిక్‌లకు విస్తరించినట్లయ్యింది. నూతన శాఖ ప్రారంభోత్సవానికి ఎంఎల్‌ఎ సంజీవ రెడ్డి, ఐడిఎ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు నరసింహ స్వామి హాజరయ్యారు. ఇందులో డాక్టర్లు అరవిద్ యుడి, భద్ర రావు, అజయ్ మోహన్, సునీల్ మంగళం, అర్చన భాగస్వాయులు అయ్యారని ఆ సంస్థ పేర్కొంది. అత్యాధునిక టెక్నాలజీతో పేషెంట్స్‌కు ఉత్తమ సౌకర్యాలను అందించడమే తమ లక్ష్యమని తెలిపింది.

రేవంత్‌రెడ్డీ..అలాంటి మహానుభావులు ఏం సహాయం చేస్తారు?

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో: బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిపై ఎమ్మెల్యే రాజాసింగ్ తన విమర్శల దాడిని ఎక్కుపెడుతూనే ఉన్నారు. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకావిష్కరణలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సహకరిస్తే తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందంటూ వ్యాఖ్యానించారు. దీనిపై రాజాసింగ్ స్పందిస్తూ...సిఎం రేవంత్‌రెడ్డీ..మీరు సహాయం అడుగుతున్న వారికి చెవులు ఉన్నా వినపడవు. నోరు ఉన్నా చెప్పరు. చేతులున్నా సహాయం చేయరు. అలాంటి మహానుభావులను అడిగితే ఏం సహాయం చేస్తారు?' అంటూ సోషల్‌మీడియా వేదికగా విమర్శలు చేశారు.

ఆస్తమా రోగులకు చేపమందు

- కౌంటర్ల ద్వారా పంపిణీ
- రెండ్రోజుల పాటు అందజేత
- లైన్‌లో గుండెపోటుతో మెదక్ జిల్లా వాసి మృతి
- బత్తిని కుటుంబానికి పద్మశ్రీ అవార్డు కోసం సిఫార్సు: మంత్రి

చేప ప్రసాదం కోసం భారీగా తరలివచ్చిన ఆస్తమా బాధితులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆస్తమాతో బాధపడుతున్న రోగులకు బత్తిని సోదరులు ప్రతి ఏటా మృగశిర కార్తెను పురస్కరించుకుని ఉచితంగా సరఫరా చేసే చేప మందు పంపిణీ హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆదివారం ప్రారంభమైంది. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్‌యాదవ్, ఫిషరీష్ చైర్మన్ మెట్టు సాయికుమార్, కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్, బత్తిని అమర్నాథ్‌గౌడ్, బత్తిని కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభించారు. రెండ్రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. పోలీసులు భారీ బందోస్తు ఏర్పాటు చేశారు. కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా పెట్టారు. చేప మందు కోసం తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, బీహార్, ఉత్తరప్రదేశ్, ఒడిషా, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల నుంచి కూడా ఆస్తమా బాధితులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ప్రజల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈసారి 42 లైన్లను ఏర్పాటు చేశారు. 13 కౌంటర్ల ద్వారా చేప మందు పంపిణీ చేస్తున్నారు. చేప ప్రసాదం పంపిణీ కోసం ఫిషరీస్ శాఖ లక్ష చేప పిల్లలను సిద్ధంగా ఉంచింది. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు ఆర్‌టిసి 140 స్పెషల్ బస్సులను 14 డిపోల నుంచి నడుపుతోంది. కాచిగూడ, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జెబిఎస్, ఎంజిబిఎస్ నుంచి బస్సులను సిద్ధంగా ఉంచింది. కాగా, లైన్‌లో గుండెపోటుతో మెదక్ జిల్లాకు చెందిన వృద్ధుడు మృతి చెందారు.

బత్తిని కుటుంబానికి పద్మశ్రీ అవార్డు కోసం సిఫార్సు - మంత్రి పొన్నం

బత్తిని కుటుంబం 170 ఏండ్లుగా చేప మందును లక్షలాది మంది ఉబ్బసం రోగులకు అందించడం గర్వించదగ్గ విషయమని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా ఈ చేప మందును స్వీకరించేందుకు వస్తుంటారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 15 రోజుల నుంచే అన్ని రకాల చర్యలు తీసుకుంటూ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. మృగశిర కార్తె రోజు చేప మందు తినడం వల్ల ఆస్తమా వ్యాధి తగ్గుతుందని చాలా మంది నమ్మకం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున బత్తిని కుటుంబానికి పద్మశ్రీ అవార్డు కోసం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తామని చెప్పారు.

ప్రపంచవ్యాప్త గుర్తింపుకు సహకరిస్తాం : మహేష్ కుమార్‌గౌడ్

చేప మందు ప్రసాదాన్ని తాను 1995 నుంచి తీసుకుంటున్నానని, తన భార్య ఢిల్లీ నుంచి వచ్చి ఈ చేప ప్రసాదం తీసుకుంటున్నారని, బత్తిని కుటుంబం తన భార్య బంధువులు అని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. నేచురల్ ఔషధాలతో కూడిన మందు అని తెలిపారు. ఈ చేప ముందుకు దాదాపు 170 ఏళ్ల చరిత్ర ఉందని, ఇది ప్రజల విశ్వాసంతో కూడిన మందు అన్నారు. లక్షల మందికి జబ్బు నయం అవడం సంతోషకరమన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ఉబ్బసం రోగులు వస్తున్నారని తెలిపారు. చేప మందుకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు రావడానికి ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. బత్తిని కుటుంబానికి పద్మశ్రీ అవార్డు వచ్చేలా సహకరిస్తామని రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్ తెలిపారు. రానున్న రాజ్యసభ సమావేశాల్లో ఈ విషయాన్ని లేవనెత్తనున్నట్టు చెప్పారు. మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ.. బత్తిని కుటుంబ సభ్యులు నిస్వార్థ సేవ చేస్తున్నారన్నారు. ఫార్మాసిటికల్ కంపెనీస్ దుష్ప్రచారం చేసినా.. బత్తిని హరినాథ్‌గౌడ్ వెనుకడుగు వేయలేదన్నారు. బత్తిని కుటుంబ సభ్యులను ప్రభుత్వం గుర్తించి అత్యంత విలువైన పురస్కారాన్ని ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఫిషరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అవసరమయ్యే చేపలను ఫిషరీ శాఖ తరపున అందుబాటులో ఉంచామని తెలిపారు.

మెదక్ జిల్లా వాసి మృతి

మెదక్ జిల్లాకు చెందిన సత్యనారాయణ (75) లైన్‌లో స్పృహ తప్పి పడిపోయారు. ప్రథమ చికిత్స చేసి 108 అంబులెన్స్‌లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

సహాయ పరికరాల దరఖాస్తు గడువు పొడిగించాలి : ఎన్‌పిఆర్‌డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో: వికలాంగులు సహాయ పరికరాల పొందెందుకు దరఖాస్తూ గడువు జూన్ 30 వరకు పొడిగించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా సహాయ పరికరాలు మంజూరు చేయాలని నిర్ణయించడం పట్ల హర్షం ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం ఆ సంఘం గౌరవాధ్యక్షులు వరమ్మ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య, కోశాధికారి ఆర్ వెంకటేశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ సవరించకుంటే ఆందోళన తప్పదని వారు హెచ్చరించారు. టిపిసిసి విడుదల చేసిన నోటిఫికిషన్‌లో ఈ నెల 18వరకు మాత్రమే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసిన వారికి మాత్రమే పరికరాలు మంజూరు చేయాలని నిర్ణయించడమేంటని ప్రశ్నించారు. తక్కువ వ్యవధిలో అవసరమైన సర్టిఫికెట్లు సమకూర్చుకోవటం సాధ్యం కాదని గుర్తు చేశారు. రూ. 35 కోట్ల విలువైన పరికరాలు ఇవ్వాలని నిర్ణయం చేసిన అధికారులు దరఖాస్తూ చేసుకోవడానికి కనీసం 30 రోజుల సమయమైనా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తూ చేయాలనే నిబంధన వల్ల గ్రామీణ ప్రాంత వికలాంగులకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉందని తెలిపారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్ లైన్‌లోనూ స్వీకరించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. టివిసిసి చైర్మన్ ముత్తినేని వీరయ్య జోక్యం చేసుకోవాలని, నోటిఫికేషన్ సవరించే విదంగా అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

ఆరోపణలు.. ప్రత్యారోపణలు

- ఆయుధాలుగా కాళేశ్వరం, బనకచర్ల

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర రాజకీయాలు రోజురోజుకు రూపుమార్చుకుంటున్నాయి. అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రచ్ఛన్నయుద్ధం జరుగుతున్నది. అరోపణలు, విమర్శలతో కాలంవెల్లదీస్తున్నారు. వెరసీ ప్రజాసమస్యలు గాలికిపోతున్నాయి. ఒకటి, రెండు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు రానుండటంతో ఒకరిపైఒకరు దుమ్మెత్తిపోసుకుంటున్నారు. సాధారణ పథకాలకు సైతం నిధుల్లేక లబ్ధిదారులు ఇబ్బందులు పడే పరిస్థితులు తలెత్తాయి. ఆదాయం లేకపోవడంతో కనీస ఖర్చులకు కూడా డబ్బులు సరిపోవడం లేదనీ పదే పదే చెబుతున్న సిఎం రేవంత్, కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి అక్రమాల అంశాన్ని ఎజెండా చేసి బిఆర్‌ఎస్‌ను ఇరుకునపెట్టేందుకు శతథా ప్రయత్నిస్తున్నారు. ఈ రకంగానే బిఆర్‌ఎస్ సైతం గొంతెత్తుతున్నది. ఎపిలో చంద్రబాబు ప్రభుత్వం గోదావరి బేసిన్‌లో అనుమతుల్లేకుండా రూ. 82 వేల కోట్లతో తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టేందుకు బీఆర్‌ఎస్ వ్యూహారచన చేసుకుంది. ఇటు తెలంగాణలోని కాళేశ్వరం అవినీతి, అక్రమాలు అధికార కాంగ్రెస్ ప్రభుత్వం, అటు ఎపిలోని ప్రతిపాదిత బనకచర్ల ప్రాజెక్టుపై ప్రతిపక్షం ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌కు ఆయుధాలుగా మారిపోయాయి. ఈ రెండింటి మధ్య ప్రజాసమస్యలు గాలికిపోతున్నాయి. వానాకాలం సీజన్ వచ్చింది. రైతులకు రైతుభరోసా సాయం రైతులకు రావాల్సి ఉంది. ఇందుకు రూ. 9 వేల కోట్లు కావాలి. ఇందుకోసం బాండ్లను అమ్మేందుకు ప్రభుత్వం సిద్ధపడింది. ఆర్‌బీఐ ద్వారా నిధులు సమకూర్చుకునేందుకు తంటాలు పడుతున్నది. సాధారణ ప్రజలకు పింఛన్లు కావాలి. ప్రభుత్వ పథకాలకు నిధులు అందడం లేదు. వేల కోట్లల్లో పెండింగ్ బిల్లులు ఉన్నాయి. ఉద్యోగులకు డీఏలు ఇవ్వాల్సి ఉంది. పీఆర్సీ సంగతి మరిచేపోయారు. నిధులు లేవంటూ వాస్తవాలను చెప్పడం ద్వారా ప్రజలను ప్రసన్నం చేసుకోవచ్చనే ఆలోచనలో సీఎం రేవంత్ ఉన్నట్టు సమాచారం. ఈ పరిస్థితిని బీఆర్‌ఎస్ వాడుకునే ప్రయత్నం చేస్తున్నది. పథకాలకు నిధుల్లేవంటూ ఒకసారి, రైతు భరోసా ఇవ్వట్లేదంటూ మరోసారి ప్రభుత్వంపై దాడికి ప్రతిపక్షం చేస్తున్నది.

ఫారెస్ట్ వర్సెస్ రెవెన్యూ

- దశాబ్దాలుగా నలుగుతున్న భూ సమస్య
- రాష్ట్రంలో పది లక్షల ఎకరాల్లో వివాదం
- పరిష్కారాన్ని ప్రస్తావించని 'భూ భారతి-2024'
- మాటలకే పరిమితమైన ఉమ్మడి సర్వే

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

"రాష్ట్రంలోని 119 నియోజక వర్గాల్లో 35 చోట్ల ఫారెస్ట్, రెవెన్యూ శాఖల మధ్య భూ వివాదం నడుస్తోంది. దీనివల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సాధ్యమైనంత తొందరగా ఈ సమస్యకు పరిష్కారం కనుగొంటాం. ధరణి స్థానంలో కొత్తగా తీసుకొచ్చే 'భూ భారతి-2024' చట్టంతో ఈ సమస్యకు చెక్‌పెడతాం" అని గతేడాది శీతాకాల అసెంబ్లీ సమావేశాల సాక్షిగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.కానీ జూన్ 2 నుంచి రాష్ట్రంలో అమల్లోకి వచ్చిన కొత్త చట్టంలో ఈ సమస్యను ప్రభుత్వం మచ్చుకైనా ప్రస్తావించలేదు. ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇరు శాఖల మధ్య పెండింగ్‌లో ఉన్న దాదాపు 10 లక్షల భూముల గెట్ల పంచాయతి ఇప్పట్లో తెగేలా లేదు. ఆసిఫాబాద్ జిల్లాలో రెవెన్యూ శాఖ పట్టాలు జారీ చేసిన 70 వేల ఎకరాలకు పైగా భూములను అటవీ శాఖ తమదిగా వాదిస్తోంది. జిల్లాలో మొత్తం ఎనిమిది మండలాల్లో ఈ రెండు శాఖల మధ్య వివాదాలు కొనసాగుతున్నట్టు తెలుస్తోంది. ఒక్క అసిఫాబాద్ అనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి అదిలాబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఈ సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్రంలో అటవీ, రెవెన్యూ శాఖల మధ్య దాదాపు 10 లక్షల ఎకరాలు వివాదంలో ఉన్నాయని ప్రభుత్వ వర్గాలంటున్నాయి. స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా ఇప్పటి వరకు రెండు శాఖల మధ్య భూముల హద్దుల నిర్ణయం జరగక పోవటం వల్లే ఇలాంటి సమస్యలు ఉత్పన్నమయ్యాయని అధికారులు చెబుతున్నారు. గతంలో అసైన్మెంట్ కమిటీలు అటవీ భూములను ఆనుకుని జారీ చేసిన పట్టాలతో పాటు కొన్ని ప్రాంతాల్లో గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములు కూడా ఈ వివాదంలో ఉన్నాయి. ఎమ్మెల్యేల అధ్యక్షతన అసైన్మెంట్ కమిటీలు మూడు దఫాలుగా రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు స్థానిక పరిస్థితులను బట్టి భూమిని పంపిణీ చేశాయి. వాటికి లావోణీ పట్టాలు ఇచ్చిన రెవెన్యూశాఖ చాలా ప్రాంతాల్లో అధికారికంగా హద్దులు చూపించలేదు. లావోణీ పట్టాలు పొందిన వారికి స్థానిక పట్వారీలు ఇదే నీ సరిహద్దు అంటూ ఖాళీగా ఉన్న స్థలాలను చూపించారు. రెవెన్యూ అధికారులు ఇచ్చిన పట్టా ఉంది. కాని మోఖమీద భూమి లేదు. ఎందుకంటే ఈ భూమి మాదంటూ అటవీ అధికారులు సదరు పట్టాదారున్ని తరిమి, కందకం తవ్వి కంచెలు కడుతున్నారు. ఎదురు తిరిగితే కేసులు పోలీసు స్టేషన్లు. అయినా పంచాయితి తెగడం లేదు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల ఒత్తిడి ఉన్న చోట ఉమ్మడిగా రెండూ శాఖల అధికారులు సర్వే చేపట్టారు. అయినా వివాదం పరిష్కారం కావడం లేదు. ఇది మా భూమని రెవెన్యూ శాఖ అధికారులు, ఇది మా భూమని అటవీ శాఖ అధికారులు అంటున్నారు. మా సర్వే కరెక్టంటే... మా సర్వే కరెక్టని ఇరు వర్గాలు గొడవ పడుతున్నాయి. గతేడాది అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాన్ని ఆంగీకరించింది. ఈ వివాదాలకు ఫుల్‌స్టాప్ పెడతామని ప్రకటించినా, ఆచరణలో మాత్రం అడుగు ముందుకు పడటం లేదు.

అటవీ భూముల గుర్తింపులో ఏక పక్షం

అటవీ భూముల గుర్తింపులో ఆ శాఖ ఏక పక్షంగా వ్యవహరిస్తోందనే విమర్శలున్నాయి. అటవీ భూములు నిర్ధారించేందుకు చాలా ప్రాంతాల్లో సరైన హద్దులు లేవు. దాంతో రిజర్వు ఫారెస్టు హద్దులు గుర్తించడం కష్టంగా మారింది. అటవీ అధికారుల సర్వే మెకానిజం ప్రకారం ఏక పక్షంగా గుర్తిస్తున్నారు. సెక్షన్ నాలుగు ప్రకారం ఈ భూమి తమదని అటవీశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తోంది. అ తర్వాత సదరు భూమని తమ ఆధీనంలో తీసుకుని కందకాలు తవ్వడం, కంచెలు నిర్మించడం లాంటి చర్యలు పాల్పడుతోంది. అటవీ శాఖ చర్యలను భూ నిపుణులు తప్పుపడుతున్నారు. ఇరు శాఖల మధ్య సరిహద్దు వివాదాలున్న చోట వాటి పరిష్కారానికి ముందు సెటిల్‌మెంట్ అధికారిని నియమించాలి.

ఆ తర్వాత రెండు శాఖలు జాయింట్ సర్వే చేయాలి. ఇందులో ఎవరిదని తేలితే వారికి ఆ భూమి చెందుతుంది. అయితే అటవీశాఖదని తేలితే మాత్రం సెక్షన్ ఐదు ప్రకారం సమగ్ర రిపోర్ట్ తయారు చేయాలి. అలాగే సెక్షన్ 6 ప్రకారం పరిహారం ప్రకటించాలి. ఇలా వివిధ దశల అనంతరం సెక్షన్ 15 ప్రకారం అటవీ శాఖకు అధికారికంగా రెవెన్యూ శాఖ నుంచి భూమి బదిలీ అవుతుంది.

జాయింట్ సర్వేనే సమస్యకు పరిష్కారం

టి సాగర్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

రాష్ట్రంలో అటవీ, రెవెన్యూ శాఖల మధ్య ఏండ్లుగా వివాదాలు నడుస్తున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొంటామని ఎన్నికల ముందు కాంగ్రెస్ సర్కార్ ప్రకటించింది. కొత్తగా తీసుకువొచ్చిన భూ భారతి చట్టంలో ఇరు శాఖల మధ్యనున్న సరిహద్దు వివాదాలను కనీసం ప్రస్తావించలేదు. దశాబ్దాలుగా భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులు, గిరిజనేతరులు తమ భూములను ఖాళీ చేయాలని అటవీశాఖ దౌర్జన్యాలకు పాల్పడుతోంది. కొన్ని ప్రాంతాల్లో పండించిన పంటలను నరికివేస్తున్నారు. ప్రభుత్వం ఇరు శాఖలతో జాయింట్ సర్వే నిర్వహించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి.

గోదావరిలో గల్లంతైన ఆరుగురి మృతదేహాలు వెలికితీత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ గోదావరి నదిలో శనివారం సాయంత్రం గల్లంతైన ఆరుగురు యువకుల మృతదేహాలను ఆదివారం వెలికితీశారు. శనివారం రాత్రి వరకు సింగరేణి ఎన్‌డిఆర్‌ఎఫ్, స్థానిక జాలర్లు గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో.. ఆదివారం ఉదయం మళ్లీ జిల్లా అడిషనల్ కలెక్టర్ అశోక్ రహమాన్‌రెడ్డి ఆధ్వర్యంలో గాలించారు. మధ్యాహ్నం లోపు ఆరుగురి మృతదేహాలను వెలికి తీశారు. మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించాక మృతదేహాలను సిఐ రామచంద్రరావు, ఎస్‌ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు అప్పగించారు. మృతులు పట్టి మధుసూదన్, శివమనోజ్, తొగరి అక్షిత్, కర్నాల సాగర్ అంబటిపెల్లికి చెందిన వారు. మిగతా ఇద్దరు మహాముత్తారం మండలం కొర్లకుంటకు చెందిన పాండు అలియాస్ రామ్‌చరణ్, స్తంభంపెల్లికి చెందిన రాహుల్. అంబటిపల్లి గ్రామానికి చెందిన మధుసూదన్, శివమనోజ్, రక్షిత్ మృతదేహాలకు ఒకేచోట అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంత్యక్రియల్లో బిఆర్‌ఎస్ మండల అధ్యక్షులు లింగంపల్లి శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి విలాస్‌రావు, ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పెండ్లికి వెళ్లి..

మృతిచెందిన వారంతా విద్యార్థులు. బంధువుల పెండ్లికి హాజరయ్యారు.

ఆ తర్వాత మేడిగడ్డ గోదావరి నదిలోకి స్నానానికి వెళ్లారు. వీరందరినీ పట్టి వెంకటస్వామినే ఆటోలో తీసుకెళ్లాడు. గోదావరి నది లోతులోకి వెళ్లి స్నానం చేస్తుండగా తనకళ్ల ఎదుట ఇద్దరు కొడుకులతోపాటు చెల్లి కొడుకు, మరో ముగ్గురు గోదావరిలో మునిగి గల్లంతు కావడాన్ని చూసిన వెంకటస్వామి గుండెలు బాదుకున్నాడు.

గాంధీ.. గిదేందీ..?

- సమస్యల వలయంలో గాంధీ ఆస్పత్రి
- తరచూ నీటి సరఫరాలో అంతరాయం
- అస్తవ్యస్తంగా అగ్నిమాపక వ్యవస్థ
- బిల్లులు చెల్లించక నిలిచిన ఫోన్ సేవలు
- సాయంత్రం ఒపి సేవలు బంద్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద ధర్మాస్పత్రిగా పేరున్న సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో అన్నీ సమస్యలే. తరచూ నీటి సరఫరా నిలిచిపోతుంది. ఆస్పత్రిలో మురుగునీరు ప్రవాహంలా పారుతుంది. తరచూ లిఫ్ట్‌లు మొరాయిస్తున్నాయి. బిల్లు చెల్లించకపోవడంతో ఫోన్ సేవలు నిలిచిపోయాయి. సాయంత్రం ఒపి సేవలు బంద్ అయ్యాయి. అగ్నిమాపక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఆధార్ కార్డు లేకుంటే వైద్యం అందించడం లేదు. ఇలాంటి నేపథ్యంలో అత్యవసర విభాగంతోపాటు ఒపి సేవలను ఆస్పత్రి సూపరింటెండెంట్, ఆర్‌ఎంఓలు పర్యవేక్షించాల్సి ఉండగా.. అలాందేమీ జరగడం లేదు.

మొరాయిస్తున్న లిఫ్ట్‌లు

1200 బెడ్ల సామర్థ్యం గల గాంధీ ఆస్పత్రికి ప్రతి సోమవారం సుమారు 1500 మంది ఔట్ పేషెంట్లు వస్తుంటే.. ఆస్పత్రి స్థాయికి మించి ఇన్ పేషెంట్లు చికిత్స తీసుకుంటున్నారు. ఆస్పత్రిలో నిత్యం ఏదో ఒక సమస్యతో ఉత్పన్నమవుతోంది. ఆస్పత్రి ప్రాంగణంలో అప్పుడప్పుడు మురుగునీరు ప్రవహించడంతోపాటు పై అంతస్థుకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన లిఫ్ట్ మొరాయిస్తుంది. రెండో అంతస్థులో ఉన్న చర్మ, లైంగిక వ్యాధుల ఒపి విభాగానికి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన లిఫ్ట్‌కు కూడా తరచూ అంతరాయం ఏర్పడుతుండటంతో రోగులు, వారి సహాయకులు ఇబ్బందులు పడుతున్నారు.

మదర్ చైల్డ్ సెంటర్‌లో..

200 పడకల సామర్థ్యంతో ఇటీవల నిర్మించిన సూపర్ స్పెషాల్టీ మాతా శిశుఆరోగ్య కేంద్రంలోనూ ఇబ్బందులు తప్పడం లేదు. బాలింతలు, గర్భిణుల వెంట ఉండే సహాయకులు పడరాని పాట్లు పడుతున్నారు. సహాయకుల షెల్టర్ సరిపోకపోవడంతో ఆస్పత్రి బయటే రోజుల తరబడి ఉండాల్సిన పరిస్థితి.

మరోవైపు ఆస్పత్రి నుంచి వెలువడే మురుగునీరు పొంగి బయటకు రావడంతో ఆ పక్కనే విశ్రాంతి తీసుకుంటున్న సహాయకులు ఇబ్బందులు పడుతున్నారు. వెయిటింగ్ హాల్ కూడా లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే గర్భిణులు, సహాయకులు ఇబ్బందులు పడుతున్నారు. మెట్ల వద్దే ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది.

సాయంత్రం ఒపి సేవలు బంద్

గతంలో ఒపి విభాగంలో సాయంత్రం వేళల్లోనూ వైద్య సేవలు అందేవి. ఇప్పుడు సాయంత్రం క్లీనిక్‌ను మూసేశారు. అత్యవసర పరిస్థితుల్లో గాంధీ ఆస్పత్రికి వస్తున్న రోగులు కొంతమంది ఆధార్ కార్డు మర్చిపోతున్నారు. కానీ ఇక్కడ ఆధార్ ఉంటేనే ఒపి చీటీ ఇవ్వాలనే నిబంధనలు పెట్టారు. ఆధార్ కార్డు తేవడం మర్చిపోయిన వారు ఇబ్బందులు పడుతున్నారు.

ముందుకు సాగని అగ్నిమాపక వ్యవస్థ ఆధునీకరణ

అన్ని విభాగాల వార్డులు, ఆపరేషన్ థియేటర్లు, రక్త నిధి కేంద్రం, ఆరోగ్యశ్రీ వార్డులు, అత్యాధునిక పరికరాలతో కూడిన వైద్య పరీక్షల కేంద్రాలు, సూపర్‌స్పెషాల్టీ విభాగాలు, పరిపాలనా కేంద్రం, వైద్య కళాశాల, వైద్య విద్యార్థుల వసతి గృహాలు ఇలా అనేక విభాగాలు ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. నిత్యం ఒపి రోగులు, వార్డుల్లో ఉన్న రోగులు, వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది, రోగుల సహాయకులు, వివిధ పనుల కోసం వచ్చివెళ్లే సందర్శకులతో కలిపి నిత్యం దాదాపు పది వేల మంది వరకు ఆస్పత్రిలో రాకపోకలు సాగిస్తుంటారు. ఇంత కీలకమైన పరిస్థితుల్లో అత్యంత ప్రధానమైన అగ్నిమాపక వ్యవస్థ కట్టుదిట్టంగా నిర్వహించడం లేదు. ఆస్పత్రిలో అగ్నిమాపక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో ప్రమాదవశాత్తు ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే పరిస్థితి ఏంటన్నది ప్రశ్నార్థకంగా మారింది. 2003లో ఆస్పత్రికి కొత్త భవనం అందుబాటులోకి రావడంతో అప్పటి అవసరాల మేరకే అగ్నిమాపక పరికరాలను ఏర్పాటు చేశారు. వాటి పనితీరును ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తూ నిర్వాహణను చేపట్టాల్సిన యంత్రాంగం ఈ విషయాన్ని విస్మరించడంతో ప్రస్తుతం ఈ పరికరాలు తుప్పుబట్టి పనికిరాకుండా పోయాయి. దీంతో ఆస్పత్రిలో అగ్నిప్రమాదాల నుంచి రక్షణ అగమ్యగోచరంగా తయారైంది. గతంలో ఆస్పత్రిలో పలుమార్లు స్వల్ప అగ్నిప్రమాదాలు సంభవించడంతో అగ్నిమాపక అధికారులు పలు సూచనలు చేశారు. కట్టుదిట్టమైన వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని నోటీసులు జారీ చేశారు. దీంతో అగ్నిమాపక వ్యవస్థ ఆధునికీకరణకు రూ.రెండు కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆ తర్వాత అడుగు ముందుకు పడలేదు.

నీటి సరఫరాకు అంతరాయం

గాంధీ ఆస్పత్రిలో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుండటంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. శుక్రవారం రాత్రి ఈ సమస్య నెలకొనడంతో సంబంధిత యంత్రాంగం సకాలంలో స్పందించలేదని రోగుల సహాయకులు చెబుతున్నారు. శుక్రవారం రాత్రి 8.30 గంటల సమయంలో పంప్ హౌస్‌లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ట్రిప్ కావడంతో ఆయా వార్డులు, ఎమర్జెన్సీ విభాగాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. శనివారం బక్రీద్ సెలవుదినం కావడంతో నీటి సరఫరా పునరుద్ధరణ నత్తనడకన సాగింది.

గాంధీలో వైద్యానికి సంబంధించిన 30 సేవల విభాగాలు.. వాటి ఆపరేషన్ థియేటర్లు, వార్డులు, ఒపి, అత్యవసర విభాగాలు వీటన్నింటినీ అనుసంధానం చేస్తూ కొనసాగే ఆర్‌ఎంఓలు, పరిపాలన విభాగం, ఎస్టాబ్లిష్‌మెంట్, బ్లడ్ బ్యాంకు, డైట్, సెక్యూరిటీ, పారిశుధ్యం, ఫార్మసీ తదితర విభాగాలున్నాయి. వాటిని సమన్వయం చేస్తూ పనులు సవ్యంగా జరిగేందుకు ఉపయుక్తంగా సుమారు 400 టెలిఫోన్ ఇంటర్‌కంలు ఉండేవి. ప్రస్తుతం అవన్నీ నిలిచిపోవడంతో వైద్య సేవలకు విఘాతం కలుగుతోంది. బిల్లు రూ.5.76 లక్షలు చెల్లించకపోవడంతో సేవలు నిలిచిపోయినట్టు సమాచారం. ఏడాదిగా బకాయిలు చెల్లించకపోవడంతో బిఎస్‌ఎన్‌ఎల్ సంస్థ సర్వీస్‌ను నిలిపేసింది. సూపరింటెండెంట్, ఆర్‌ఎంఓలు, ముఖ్య వైద్యులు, అధికారులకు అధికారికంగా కేటాయించిన నెంబర్లు కూడా పనిచేయకపోవడం గమనార్హం.